సాక్షి రంగారెడ్డి

శనివారం । 25 । మే । 2024



ఈవీ రయ్ రయ్..

సిటీజనులు ఇప్పుడు (ఎలక్ట్రిక్ వెహికల్స్ వైపు చూస్తున్నారు.కొంతకాలంగా ఈ వాహనాల వినియోగం పెరుగుతోంది. 8లో▸



దుకాణం దగ్ధం

ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఓ కిరాణా దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన కొండకల్‌లో జరిగింది. 8లో▸



పరిష్కారానికి కృషి

రైతులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని లీఫ్స్ సంస్థ ఉపాధ్యక్షుడు జీవన్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

మత్స్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

ఇబ్రహీంపట్నం: చేప, రొయ్య పిల్లల పంపిణీని టెండర్ల విధానం ద్వారా కాకుండా.. ఈ సంవత్సరం మత్స్య సొసైటీ బ్యాంకు ఖాతాలో నగదు జమచేయాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన టీఎంకేఎంకేఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు ఆరు నెలలు గడిచినా మత్స్యశాఖకు మంత్రిని నియమించలేదని విమర్శించారు. జూన్ నెల సమీపిస్తున్నా మత్స్యకారులకు ఇచ్చే చేపపిల్లల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మృగశిర కార్తెను చేపల పండుగగా ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. చెరువులు, కుంటలు కబ్జాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలని, ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కొండల్, రాములు, కె.రాములు తదితరులు పాల్గొన్నారు.

జీవాల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

జిల్లా పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి



కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: జీవాల సంరక్షణకు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో శుక్రవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన గొర్రెలకు చిటుక రోగం నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం కురిసే వర్షాలకు భూమిపై మొలకెత్తే గడ్డిని తినడం ద్వారా గొర్రెలకు చిటుకరోగం వచ్చే అవకాశం ఉందన్నారు. చిటుకరోగం వస్తే గొర్రెలు వెంటనే మృతి చెందుతాయన్నారు. ఈ రోగం రాకుండా గొర్రెల కాపర్లు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముందు జాగ్రత్త చర్యగా చిటుక వ్యాధి నివారణ టీకాలు ప్రభుత్వం ద్వారా ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్రీలత, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో శనివారం నుంచి 2 రోజుల పాటు ఉప్పల్ శిల్పారామం వేదికగా తెలంగాణ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్ మీడియాకు తెలిపారు. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఇందులో విద్యార్థులను ప్రోత్సహించడానికి ఐఏఎస్ అధికారి శరత్ నాయక్, తెలంగాణ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరావు కూడా పాల్గొంటారన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన యూనివర్సిటీలు, కెరీర్ గైడెన్స్ నిపుణులు పాల్గొంటారని తెలిపారు. కెరీర్ గైడెన్స్ నిపుణులు అశోక్, సంస్థ ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

సాక్షి, సిటీ బ్యూరో: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయని, మొత్తం 35 కేంద్రాల్లో 12,186 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేసుకోవాలని సూచించారు.

‘హైలెవల్’.. పనులు లోలెవల్

సాగర్ హైవేపై శేరిగూడ వద్ద నిలిచిన బ్రిడ్జి నిర్మాణం

- గత ప్రభుత్వ హయాంలో రూ.3.60 కోట్లు మంజూరు
- నిధులు రాక మధ్యలోనే పనులు వదిలేసిన కాంట్రాక్టర్
- ఏడాదిగా ఇబ్బందులు పడుతున్న వాహనాదారులు



సాగర్‌రోడ్డుపై శేరిగూడ వద్ద నిలిచిపోయిన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై శేరిగూడ సమీపంలో నిలిచిపోయిన బ్రిడ్జితో నిత్యం వాహనదారులకు పాట్లు తప్పడం లేదు. ఏడాది క్రితం భారీ వర్షాలతో ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నిండి అలుగు పారి రోడ్డుపై నుంచి వరద నీరు పారింది. కొద్ది రోజుల పాటు సాగర్‌రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. శాశ్వత పరిష్కారం కోసం అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన విజ్ఞప్తి మేరకు బ్రిడ్జి నిర్మాణానికి తక్షణమే రూ.3.60 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జి నిర్మాణ బాధ్యతలను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కాంట్రాక్టర్ రూ.90 లక్షలకు పైగా ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించాడు. హైలెవల్ బ్రిడ్జితో ఇక ప్రయాణ కష్టాలు తప్పుతాయని వాహనాదారులు భావించారు. సర్కార్ నుంచి పైసా నిధులు రాకపోవడం.. అంతలోనే అసెంబ్లీకి ఎన్నికలు రావడం.. బీఆర్‌ఎస్ సర్కార్ ఓటమి పాలు కావడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కొత్త సర్కార్ ఏర్పాటై ఐదు నెలలు గడిచినా ఈ బ్రిడ్జి నిర్మాణంపై కదిలిక లేదు.

ఏడాది కాలంగా అవస్థలు..

బ్రిడ్జి నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై నిత్యం ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వీఐపీలతో పాటు ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు రాకపోకలు సాగిస్తారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో పలు ప్రముఖ కంపెనీలు, రక్షణ సంస్థలు కొలువుదీరిన నేపథ్యంలో తరచూ పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు ఈ రోడ్డు నుంచే వచ్చివెళ్తుంటారు. ఈ తరుణంలో శేరిగూడ వద్ద నిలిచిపోయిన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి దగ్గరకు వచ్చే వరకు కొత్త వాహనాదారులు గ్రహించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు కురిస్తే బ్రిడ్జి వద్ద బురదమయంగా మారుతోంది. ప్రస్తుతం పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణికుల వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. పలుమార్లు ప్రయాణికులు, ప్రజలు, పలు రాజకీయ పక్షాలు బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

సాగర్‌రోడ్డుపై పలు చోట్ల ఇలానే..

సాగర్‌రోడ్డుపై పలు చోట్ల ప్రమాదాలకు నిలయంగా మారింది. యాచారం మండల పరిధిలోని తక్కళ్లపల్లి గేట్ వద్ద కృష్ణాజలాల పైపులైన్ వద్ద ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. రోడ్డుకు అటు, ఇటు ఉన్న రక్షణ దిమ్మెలు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. యాచారం, గునగల్, ఆగాపల్లి, ఇబ్రహీంపట్నంలో సాగర్‌రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై ఇబ్రహీంపట్నం రోడ్డు భవనాల శాఖ డీఈఈ సీతారాంను సంప్రదించగా శేరిగూడ వద్ద నిలిచిపోయిన బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

వంతెన నిర్మాణం పూర్తిచేయాలి

ఇబ్రహీంపట్నం: శేరిగూడ సమీపంలోని ఇందు కళాశాల వద్ద అసంపూర్తిగా వదిలేసిన బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తిచేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సామెల్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం బ్రిడ్జి వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సామేల్ మాట్లాడుతూ.. 2022లో కురిసిన భారీ వర్షాలకు పెద్ద చెరువు నిండి ఈ రోడ్డు గుండా వరద నీరు ప్రవహించడంతో కొద్ది రోజులు రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.60 కోట్ల నిధులను మంజూరు చేసిందని...అయితే కోటి రూపాయల మేర పనులు జరిగగా.. కాంట్రాక్టర్‌కు బిల్లులను గత ప్రభుత్వం చెల్లించకపోడంతో నిర్మాణ పనులు నిలిపివేశాడన్నారు. బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ఈ దారిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ బ్రిడ్జికి సంబంధించిన నిధులు మంజూరుచేయించి తిరిగి పనులు ప్రారంభించి పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగన్, ఎల్లేష్, వెంటేష్, శంకర్, వీరేశం, యాదగిరి, ముసలయ్య, స్వప్న, నర్సింహ, దేవరాజ్ మల్లేష్ పాల్గొన్నారు.



బ్రిడ్జి వద్ద సీపీఎం నేతల నిరసన

త్వరగా పూర్తి చేయాలి



శేరిగూడ వద్ద ఏడాది కాలంగా నిలిచిపోయిన హై లెవల్ బ్రిడ్జితో ప్రమాదం పొంచి ఉంది. వాహనంపై దగ్గరకు వచ్చే వరకు బ్రిడ్జి కనిపించడం లేదు. అధికారులు త్వరగా బ్రిడ్జిని పూర్తి చేయాలి. లేదంటే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు తప్పదు.

– శీలం మధుకర్‌రెడ్డి, మంతన్‌గౌరెల్లి

పలుమార్లు ఫిర్యాదు చేశాం



బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని పలుమార్లు కలెక్టర్, రోడ్డు భవనాల శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. కొద్ది రోజుల క్రితం ఓ కారు డ్రైవర్ సడన్‌గా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపైకి ఎక్కించాడు. తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. ఇప్పటికైనా అధికారుల్లో చలనం రావాలి.

– మర్పల్లి అంజయ్య యాదవ్, మాజీ సర్పంచ్, మొండిగౌరెల్లి

ఆస్ట్రేలియాలో అనుమానాస్పద మృతి

- మృతుడు షాద్‌నగర్ వాసి
- సముద్రం ఒడ్డున లభించిన మృతదేహం
- స్వదేశానికి తెప్పించేందుకు చర్యలు



అరవింద్ (ఫైల్)



విషాదంలో అరవింద్ తల్లి ఉషారాణి

షాద్‌నగర్: పట్టణానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆస్ట్రేలియాలో అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లికార్జునకాలనీలో నివసించే బీజేపీ దివంగత నాయకుడు అరటి కృష్ణ, ఉషారాణి దంపతుల ఏకైక కుమారుడు అరవింద్(35).. పన్నెండేళ్ల క్రితం సిడ్నీ వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. ఇతనికి ఏడాదిన్నర క్రితం కేశంపేట మండలం చింతకొండపల్లికి చెందిన సిరివెన్నెలతో వివాహం జరిగింది. వీరు సిడ్నీలో ఉండగా.. కుటుంబ సభ్యులు మాత్రం షాద్‌నగర్‌లో ఉంటున్నారు.

కారు సర్వీసింగ్ కోసం వెళ్లి..

కొడుకు, కోడలిని చూసేందుకు గత ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా వెళ్లిన ఉషారాణి ఇటీవల ఇంటికి తిరిగి వచ్చింది. తల్లి ఇండియా బయలుదేరిన రోజునే కారును సర్వీసింగ్ చేయిస్తానని చెప్పి బయటకు వచ్చిన అరవింద్ తిరిగి రాకపోవడంతో సిరివెన్నెల పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సముద్రానికి కొంత దూరంలో కారు

అరవింద్ కారు శుక్రవారం సముద్రానికి కొంత దూరంలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సమయంలో వాహనానికి దూరంగా గుర్తు పట్టని స్థితిలో ఉన్న మృతదేహం కనిపించడంతో ఆస్పత్రికి తరలించారు. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం బాడీ అరవింద్‌దేనని నిర్ధారించారు.

నాడు భర్త.. నేడు కొడుకు

అరవింద్ చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన ఉషారాణి.. ఇప్పుడు కొడుకును కూడా కోల్పోయి ఒంటరిగా మిగిలింది. షాద్‌నగర్ నుంచి బీజేపీ కీలక నేతగా ఎదిగిన కృష్ణ 2006లో ఏపీలోని ఏలూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో అరవింద్‌ను అన్నీ తానై అల్లారుముద్దుగా చూసుకుంది. అంతా బాగుందనుకున్న సమయంలో కొడుకు మృతి ఆమెను పుట్టెడు దుఃఖంలో ముంచెత్తింది.

చిన్న వయసులో రోబోటెకీగా ఉద్యోగం

అరవింద్ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు షాద్‌నగర్‌లోని ఠాగూర్ ఉన్నత పాఠశాలలో చదివాడు. అనంతరం హయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి పూర్తి చేశాడు. నారాయణ కళాశాలలో ఇంటర్, శ్రీనిధి కాలేజీలో బీటెక్ కంప్లీట్ చేశాడు. ఆ వెంటనే ఆస్ట్రేలియాలోని రోబోల తయారీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (రోబోటెకీ)గా ఉద్యోగం రావడంతో సిడ్నీ వెళ్లాడు.

కిషన్‌రెడ్డి హామీ

అరవింద్ మృతదేహాన్ని షాద్‌నగర్‌కు రప్పించేందుకు సహకరించాలని కోరుతూ కుటుంబ సభ్యులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. వెంటనే స్పందించిన ఆయన భారత విదేశాంగ మంత్రికి లేఖ రాశారు. మృతదేహాన్ని త్వరలో స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డీకే అరుణ పరామర్శ

విషయం తెలుసుకున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మృతుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా నిలుస్తామని ధైర్యం చెప్పారు. అరవింద్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపడుతామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

ఎందుకెళ్లాడు..?

కారు సర్వీసింగ్ కోసం అని ఇంట్లో చెప్పి వచ్చిన అరవింద్ సముద్రం వద్దకు ఎందుకు వెళ్లాడు. అతనితో ఇంకెవరైనా ఉన్నారా..? సముద్రం వద్దకు తీసుకెళ్లి హత్యచేసి అందులో పడేశారా..? కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురై అతనే ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? అనే వివరాలు తేలాల్సి ఉంది.

బండ్లగూడ జాగీరు మేయర్ ఏకగ్రీవ ఎన్నిక

బండ్లగూడ: గండిపేట మండలం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ రెండో మేయర్‌గా మద్దెల లతాప్రేమ్‌గౌడ్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మొత్తం 21 మంది కార్పొరేటర్లకుగాను డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి సహా 17 మంది మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మేయర్ ఎన్నిక సమావేశానికి హాజరయ్యారు. కార్పొరేటర్లు అందరూ లతాప్రేమ్ గౌడ్‌కు మద్దతు తెలపడంతో ఆమె మేయర్ పీఠాన్ని దక్కించుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు.



మంగకు ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి

ఉత్కంఠకు తెర!

- ‘పట్నం’ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా బర్ల మంగ ఎన్నిక
- 14 మంది కౌన్సిలర్ల మద్దతుతో విజయం
- గైర్హాజరైన బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా బర్ల మంగయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ అనంతరెడ్డి శుక్రవారం ఉదయం వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటిలో ఉన్న 24 మంది కౌన్సిలర్లకుగాను 14 మంది కౌన్సిలర్లు ఉదయం 11 గంటలకు సమావేశ మందిరంలోకి ప్రవేశించారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్‌గా బర్ల మంగను ఎన్నుకునేందుకు 18వ వార్డు కౌన్సిలర్ ఇందిరాల రమేశ్ ప్రతిపాదించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి ఆమెను బలపరిచారు. సమావేశ మందిరంలో ఉన్న మరో 12 మంది కౌన్సిలర్లు చేతులెత్తి తమ మద్దతును తెలిపారు. ఈ పదవిని ఆశిస్తూ పోటీలో ఎవరూ లేకపోవడంతో 14 మందితో ఏకగ్రీవంగా బర్ల మంగ ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి అనంతరెడ్డి ప్రకటించారు. మంగకు మెజార్టీ ఉండటంతో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఉన్న స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి ఎన్నికకు హాజరు కాలేదు. పోటీలో ఉన్నా గెలిచే అవకాశాలు లేనికారణంగా ఇద్దరూ బీజేపీ సభ్యులు, ఎనిమిది మంది బీఆర్‌ఎస్ సభ్యులు గైర్హాజరైనట్లు సమాచారం. కాగా కాంగ్రెస్‌కు చెందిన చైర్‌పర్సన్ స్రవంతిపై గత ఫిబ్రవరిలో పెట్టిన అవిశ్వాసం వీగిపోవడం, అనంతరం బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై గత నెలలో పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

వైస్ చైర్‌పర్సన్‌గా బర్ల మంగ ఎన్నిక కావడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత, ఉద్యమకారుడైన బర్ల జగదీశ్‌యాదవ్ మాట్లాడుతూ.. తన సతీమణి మంగను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మంగకు శాలువ కప్పి, పూలదండలతో పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తాను కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. ఎన్నికకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్యల ఆధ్వర్యంలో పోలీస్ బలగాలు బందోబస్తు నిర్వహించాయి. మున్సిపల్ కార్యాలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి ఇతరులు లోనికి రాకుండా చూశారు. ప్రత్యర్థులెవ్వరూ సమావేశానికి రాకపోవడంతో ఏకగ్రీవంగా వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది.

నో ఆర్‌ఎస్..



మండే ఎండలకు తాళలేక.. మందుల దుకాణానికి వెళ్లి ఓఆర్‌ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్) తీసుకుని తాగుతున్నారా? తస్మాత్ జాగ్రత్త. అక్కడ లభించేవన్నీ అసలైన ఓఆర్‌ఎస్‌లు కావు. నిజమైన ఓఆర్‌ఎస్‌లా మభ్యపెట్టి అమ్ముకుంటున్న ఇతర పానీయాలు మాత్రమే. ఓఆర్‌ఎస్ పేరుతో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ పద్ధతి చిన్నారుల మరణాలకు దారి తీస్తోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓఆర్‌ఎస్‌ల వాడకంపై అవగాహన కల్పించడానికి హీల్ ఫౌండేషన్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఐదేళ్లలోపు చిన్నారుల్లో 13 శాతం మరణాలు కేవలం డీహైడ్రేషన్ వల్లే సంభవిస్తున్నాయని, అతిసారంతో బాధపడుతున్న పిల్లల్లో 60.6% మంది ప్రాణాలను రక్షించే ఓఆర్‌ఎస్‌ను తీసుకోలేకపోతున్నారని హీల్ ఫౌండేషన్ వెల్లడించింది. మార్కెట్‌లో లభించే ఉత్పత్తుల పేరులో ఓఆర్‌ఎస్ ఉండే విధంగా మార్చుకుని.. దాని కిందే చిన్న అక్షరాలతో ‘ఇది ఓఆర్‌ఎస్ కాదు’ అంటూనే ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

మార్కెట్‌లో లభించేవన్నీ ఓఆర్‌ఎస్‌లు కాదు

- అయిదేళ్లలోపు చిన్నారులపై తీవ్ర ప్రభావం
- పసివాళ్ల పట్ల ప్రాణాంతకమవుతున్న పరిస్థితి
- డబ్ల్యూహెచ్‌ఓ సూచించిన ఓఆర్‌ఎస్‌లనే వాడాలి
- డీహైడ్రేషన్‌లో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లపైనున్న లేబుల్ చదవకుండా ఇదే అసలైన ఓఆర్‌ఎస్ అని కొనడం అలవాటుగా మారింది. సాధారణంగా మండుతున్న ఎండలకు లేదా వైరస్ కారణంగా సంక్రమించే డయేరియా (నీళ్ల విరేచనాలు, వాంతులు) ప్రభావంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. దీంతో శరీరంలోని నీరు, లవణాలు తగ్గిపోయి నీరసమైపోతారు. ఇలాంటి తరుణంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ప్రతి లీటరుకు 13.5గ్రా చక్కెర (గ్లూకోస్) స్థాయిలు, 2.6గ్రా సోడియం, 1.5 గ్రా పొటాషియం ఉండేలా నిర్ధారించిన ఓఆర్‌ఎస్‌లను తీసుకోవాలి. కానీ.. మార్కెట్లో లభించే వాటిలో 20 గ్రాములకుపైగా షుగర్ కలుపుతున్నారు. అధిక స్థాయిలో శరీరంలోకి చేరిన చక్కెర స్థాయిలు డీహైడ్రేషన్‌ను మరింత పెంచి చిన్నారుల మరణాలకు కారణంగా మారుతోందని పులువురు వైద్యులు సూచిస్తున్నారు.

‘నాట్ యాన్ ఓఆర్‌ఎస్’ సూచిక గమనించి కొనండి..



ఓఆర్‌ఎస్ అనేది ఒక డ్రగ్. దీనిని డ్రగ్ కంట్రోలర్ విభాగం అనుమతిస్తుంది. ఓఆర్‌ఎస్‌లని భావించి ప్రజలు కొంటున్న పానీయాలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతితో మార్కెట్‌లోకి వస్తాయి. అవగాహన లోపంతో వీటినే ఓఆర్‌ఎస్‌లని భావించి డీహైడ్రేషన్ నివారణకు వినియోగిస్తుంటాం. ఇది చాలా ప్రమాదకరం. మార్కెట్‌లో ఓఆర్‌ఎస్‌గా విక్రయిస్తున్న ఉత్పత్తులపై సీడీఎస్‌ఓకు ఫిర్యాదు చేయగా 2022లో ప్రత్యేక ఆర్డర్‌ను జారీ చేశారు. ఇందులో భాగంగా సదరు సంస్థలకు ఇది ఓఆర్‌ఎస్ కాదు అని ఉత్పత్తులపై సూచించాలని పేర్కొంది. దీనిపై ప్రజల్లో అవగాహన లేకపోవడంతో ఇప్పటికీ ఈ జూస్‌లనే ఓఆర్‌ఎస్‌లుగా తీసుకుంటున్నారు. ఇలాంటి ఉత్పత్తులను ఎనర్జీ డ్రింక్స్ అంటూ ప్రముఖ సినీతారలు ప్రచారం చేయడం దురదృష్టకరం. ప్రోలైట్ ఓఆర్‌ఎస్, డాక్టర్ మొరేపెన్ ఓఆర్‌ఎస్, ఓఆర్‌ఎస్ వాలైట్ వంటి కొన్ని ఉత్పత్తులు మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలను పాటిస్తున్నాయి.

– డాక్టర్ శివరంజని సంతోష్, చీఫ్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, మాగ్నా సెంటర్

ఈవీ రయ్ రయ్..

గ్రేటర్‌లో 1.20 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు



బ్యాటరీల భరోసాతో భారీగా పెరిగిన అమ్మకాలు

లక్షకు పైగా బైక్‌లే...

క్రమంగా పెరుగుతున్న కార్లు, ఆటోలు

పెట్రోలు బంకుల్లో బారులు తీరవలసిన అవసరం లేదు. ఇంధనం కోసం ప్రతి రోజు రూ.వందల్లో వెచ్చించవలసిన పనిలేదు. రాత్రిపూట ఓ ఐదారు గంటలు చార్జింగ్ చేస్తే చాలు పగలంతా హాయిగా మీ వాహనాలపై పరుగులు తీయొచ్చు. అందుకే సిటీజనులు ఇప్పుడు ఈవీ(ఎలక్ట్రిక్ వెహికల్స్) వైపు చూస్తున్నారు. దీంతో కొంతకాలంగా నగరంలో ఈ వాహనాల వినియోగం పెరుగుతోంది. ఇంధనభారాన్ని దృష్టిలో ఉంచుకొని చాలామంది ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ఒకసారి చార్జింగ్ చేస్తే కనీసం 60 నుంచి వంద కిలోమీటర్ల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాఫీగా ప్రయాణం చేసే సదుపాయం ఉన్న వాహనాలు కూడా ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. దీంతో విద్యుత్ ఆధారిత వాహనాలపై ఆసక్తి చూపుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

గ్రేటర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య సుమారుగా..

బైక్‌లు : 10,7200
కార్లు : 9,750
ఆటోలు : 1550
ఈ–రిక్షాలు : 75
గూడ్స్ క్యారేజ్‌లు : 1500



గ్రేటర్ పరిధిలో ప్రత్యేకంగా సగటు వేతన జీవులు ఎలక్ట్రిక్ బైక్‌లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత రెండేళ్లుగా ఈ వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం గ్రేటర్‌లో సుమారు లక్షా 20 వేలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. వాటిలో లక్షకు పైగా ద్విచక్ర వాహనాలే ఉన్నట్లు అంచనా. ఈ కేటగిరీకి చెందిన వాహనాల అమ్మకాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. నగరంలో సుమారు ఐదారేళ్ల క్రితమే ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం మొదలైంది. కానీ ఈ మూడేళ్లుగా బ్యాటరీ బండ్ల దూకుడు పెరిగినట్లు రవాణా అధికారులు చెబుతున్నారు.

బ్యాటరీల భరోసా పెరిగింది...

గతంలో కంటే ఇప్పుడు నాణ్యమైన బ్యాటరీలు వినియోగంలోకి వచ్చాయి. దీంతో వాహనదారులకు ఎలక్ట్రిక్ వాహనాలపైన భరోసా పెరిగింది. నాలుగేళ్ల క్రితం నాసిరకం బ్యాటరీల కారణంగా తరచుగా ప్రమాదాలు జరగడంతో చాలామంది వెనుకడుగు వేశారు. కానీ కొన్ని ఆటోమొబైల్ సంస్థలు నాణ్యమైన బ్యాటరీలతో మార్కెట్‌లోకి వచ్చాయి. ఐదేళ్ల వారెంటీలతో వాహనాలను విక్రయిస్తున్నాయి. 'మొదట్లో నాణ్యత లేని బ్యాటరీలు త్వరగా వేడెక్కేవి. కానీ రెండేళ్లుగా ఆటోమోటివ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఏఐఎస్) ధృవీకరించిన ప్రమాణాల మేరకు బ్యాటరీలు వస్తున్నాయి. నాణ్యత బాగా పెరిగింది. బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (బీఎంఎస్) బాగుంది.' అని ఓ ఆటోమొబైల్ డీలర్ చెప్పారు. దీంతో ధర కాస్త ఎక్కువే అయినా నమ్మకమైన బ్రాండ్‌లకు చెందిన వాహనాలనే వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ప్రభుత్వం కార్లతో పాటు 2 లక్షల బైక్‌లకు జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిచ్చింది. హైదరాబాద్‌తో పాటు, తెలంగాణ అంతటా ప్రస్తుతం 1.6 లక్షలకు పైగా ద్విచక్రవాహనాలు రోడ్డెక్కాయి. మరో 90 వేలకు పైగా వాహనాలకు పన్ను మినహాయింపు అవకాశం ఉంది. ఎలక్ట్రిక్ కార్లకు కూడా జీవితకాల పన్ను నుంచి మినహాయింపునిచ్చారు. దశలవారీగా 8 వేలకు పైగా వాహనాలకు ఈ అవకాశం లభించింది.

వెయిట్ ప్లీజ్...

ఎలక్ట్రిక్ బైక్‌లకు ఇటీవల భారీగా డిమాండ్ పెరిగిన దృష్ట్యా..కొనుగోలుదారులు కనీసం రెండు, మూడు నెలల ముందే వాహనాలను బుక్ చేసుకోవలసి వస్తోంది. కొన్ని బ్రాండ్‌లకు చెందిన వాహనాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని కనీసం 3 నెలల పాటు ఎదురుచూడవలసి వస్తుందని కుషాయిగూడకు చెందిన రాఘవ తెలిపారు. పెట్రోల్ వాహనాల కంటే ధర కొద్దిగా ఎక్కువే అయినా ఇంధన భారాన్ని దృష్టిలో ఉంచుకొని ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

- అడ్డుకున్న కుమార్తెపై దాడి చేసిన స్నాచర్లు
- కేకలు వేయడంతో బైక్‌ను వదిలేసి పరారు

పహాడీషరీఫ్: అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో వాకింగ్ చేస్తున్న మహిళ మెడలోని మంగళసూత్రాన్ని దుండగులు తెంచుకొని ఉడాయించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రతిఘటించేందుకు యత్నించిన బాధితురాలితో పాటు ఆమె కూతురు తలపై దాడి చేశారు. అయినప్పటికీ బాధితురాలి నిందితుల బైక్ తాళంచెవి లాక్కోవడంతో, చేసేది లేక బైక్ అక్కడే వదిలేసి మూడున్నర తులాల బంగారు గొలుసుతో పారిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంఖాల్ గ్రామానికి చెందిన గడ్డమీది మహేందర్ భార్య కల్పన(32) వేసవి సెలవులు కావడంతో ఆమె పిల్లలు లక్ష్మీ ప్రసన్న, హేమ చందర్, హేమంత్, పక్కింటి పిల్లలు పావనీ, నేహశ్రీ, మనీష్ కుమార్‌లతో కలిసి శుక్రవారం ఉదయం 5 గంటలకు ఓఆర్ఆర్ శంషాబాద్ వైపు సర్వీస్ రోడ్డులో కిలోమీటర్ నడిచి తిరిగి మంఖాల్‌కు వస్తున్నారు. 5.50 గంటల సమయంలో ఇద్దరు యువకులు రోడ్డు పక్కన హెల్మెట్లు ధరించి షైన్ బైక్‌తో నిలబడ్డారు. పిల్లలు ముందు నడుస్తుండగా కల్పన వెనుకాల నడుచుకుంటూ పోతుంది. ఈ సమయంలో ఒక్కసారిగా నిందితులు తమ చేతిలోని ఎర్రటి వాటర్ బాటిల్‌లో ఉన్న నీటిని కల్పన కళ్లల్లో చల్లారు. ఆమె కళ్లు మూసుకోవడంతో మెడలోని మూడున్నర తులాల బంగారు మంగళసూత్రాన్ని తెంచారు. గొలుసును ఒక వైపు లాగి పట్టుకోగా, నిందితులు కర్రతో ఆమె నుదుటిపై బాదారు. ఇది గమనించిన కల్పన కుమార్తె లక్ష్మీ ప్రసన్న పట్టుకునేందుకు యత్నించగా ఆమెను కూడా కర్రతో కొట్టారు. గాయాలైనప్పటికీ కల్పన చాకచక్యంతో బైక్ తాళం చెవి గుంజుకొని గట్టిగా కేకలు పెట్టారు. భయపడిపోయిన నిందితులు బైక్‌ను అక్కడే వదిలేసి మంగళసూత్రంతో అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడ్డ ఇద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను గుర్తించేందుకు డీఐ సు. దీర్‌కృష్ణ పర్యవేక్షణలో స్థానికంగా సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

దాదాపు రూ.20 లక్షల వరకు ఆస్తినష్టం

చేవెళ్ల: ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఓ కిరాణా దుకాణం దగ్ధమైంది. ఈ సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి కొండకల్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామంలో గణపతిరెడ్డి కొన్నేళ్లుగా కిరాణ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే గురువారం రాత్రి దుకాణం బంద్ చేసి ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు తెల్లవారుజామున దుకాణంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఈ విషయం గమనించి స్థానికులు గణపతిరెడ్డికి సమాచారం అందించారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకొని స్థానికుల సహాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ మంటలు ఎక్కువగా వ్యాపించడంతో దుకాణం మొత్తం బూడిదయింది. దాదాపు రూ.20 లక్షల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పందించని ఫైర్ సిబ్బంది

ప్రమాదంపై స్థానికులు 101కి డయల్ చేశారు. ఆ సమయంలో గచ్చిబౌలి, మాదాపూర్, పటాన్‌చెరు అగ్నిమాపక కేంద్రాలు శంకర్‌పల్లి మా పరిధి కాదంటూ కాలయాపన చేశారు. బాధితుడు, స్థానికులు కలిసి మంటలను ఆర్పివేసేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. దీంతో ఫైర్ శాఖ నిర్లక్ష్యంపై స్థానికులు మండిపడ్డారు. అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పిన కూడా స్పందించకపోవటంతో విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైర్ స్టేషన్ సిబ్బంది సకాలంలో స్పందించి వచ్చి ఉంటే ఆస్తినష్టం తగ్గేదని బాధితుడు వాపోయారు.



కాలిపోయిన కిరాణా దుకాణం

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఇబ్రహీంపట్నం రూరల్: అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని టీసీఎస్ ఎదురుగా ఉన్న అక్రమ నిర్మాణాలను కమిషనర్ బాలకృష్ణ, టీపీఓ అబీబ్ ఉన్నీసాలు సిబ్బందితో కలిసి కూల్చివేశారు. జేసీబీలతో నిర్మాణాలు కూల్చగా, డ్రిల్లింగ్ మిషన్లను పెట్టి ఇంటిపై కప్పులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కమిషనర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. మున్ముందు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. మున్సిపాలిటీలో నిర్మాణాలు చేపట్టడానికి సులభతర పద్ధతుల్లో అనుమతులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ అనుమతులు తీసుకొని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.



ఆదిబట్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న అధికారులు

కుమారుడితో కలిసి గృహిణి అదృశ్యం

పహాడీషరీఫ్: రెండేళ్ల కుమారుడితో కలిసి గృహిణి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. హర్షగూడ గ్రామానికి చెందిన మోహన్ కుమార్తె అంగోతు శిరీష (22)కు రెండేళ్ల కుమారుడు చోటూ ఉన్నాడు. ఆమెకు అనారోగ్యంగా ఉండడంతో 15 రోజుల క్రితం పుట్టింటికి తీసుకొచ్చారు. ఈ నెల 23న శిరీష తన కుమారుడితో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో, తల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.



శిరీష (ఫైల్)

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

మలక్‌పేట: ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ జయంత్ తెలిపిన వివరాల ప్రకారం..ప్రైవేట్ ఉద్యోగి ఎం.వెంకటేష్ భార్య స్వాతి (28), కుమారులు అభిజ్ఞాన్ (4), వశిజ్ఞాన్(3)తో కలిసి మూసారంబాగ్ ఫ్రెండ్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 21 తేదీన ఉదయం 6.30 గంటలకు స్వాతి ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో భర్త ఆమె సెల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వెదికినా ఆచూకీ దొరకలేదు. దీంతో మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో ఇలా రెండు, మూడు సార్లు స్వాతి బయటికి వెళ్లి తిరిగి వచ్చిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



స్వాతి, పిల్లలు అభిజ్ఞాన్, వశిజ్ఞాన్

ఎంఎంటీఎస్ సర్వీసులు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం దృష్ట్యా ఈ నెల 25, 26 తేదీల్లో వివిధ మార్గాల్లో నడిచే పలు ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఫలక్‌నుమా–సికింద్రాబాద్, సికింద్రాబాద్–మేడ్చల్, సికింద్రాబాద్–ఫలక్‌నుమా, మేడ్చల్–లింగంపల్లి. మేడ్చల్–సికింద్రాబాద్, లింగంపల్లి–మేడ్చల్, మేడ్చల్–హైదరాబాద్, మేడ్చల్–సికింద్రాబాద్, సిద్దిపేట్–సికింద్రాబాద్ (డెమూ) తదితర మార్గాల్లో రాకపోకలు సాగించే 26 సర్వీసులు రద్దు కానున్నాయి.

ఫేక్ వార్తలు వ్యాప్తి చేయొద్దు: నటుడు శ్రీకాంత్

బంజారాహిల్స్: నిజమైన వార్తలు రాస్తే చాలా మంచిదని, కానీ తప్పుడు వార్తలు రాస్తే అలాంటి వెబ్‌సైట్లు, చానళ్లపై ఫిర్యాదు చేస్తానని, వారు న్యాయపరంగా చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని సినీ నటుడు శ్రీకాంత్ అన్నారు. రేవ్ పార్టీ ఘటన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాను రేవ్ పార్టీలో ఉన్నట్లు వచ్చిన వీడియోలో ఉన్నది తాను కాదని చెప్పినా కూడా కొంత మంది ఇంకా వాటిని తానే అన్నట్లుగా ప్రసారం చేస్తున్నారని, అది మంచి పద్ధతి కాదని అన్నారు. తాను పోలీసులకు, కోర్టుల్లోనే ఫిర్యాదు చేయాల్సి వస్తుందని అన్నారు. తనది రేవ్ పార్టీలకు వెళ్లే నేచర్ కాదని ఆయన అన్నారు. శుక్రవారం ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ హెబ్బా పటేల్, ప్రముఖ నిర్మాత ఏఎంరత్నం, నటులు బాలాదిత్య, శ్రవణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

దానం, ధర్మ గుణం గొప్పవి

హాస్యావధాని శంకరనారాయణ

చిక్కడపల్లి: అన్ని దానాలకన్న అన్నదానం మిన్న అంటారని..కానీ విద్య, కళా దానం జీవితాలనే నిలబెడతాయని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. ప్రతి మనిషికి దాన, ధర్మ గుణాలు ఉండాలన్నారు. త్యాగరాయగానసభలో శుక్రవారం అంజన గోలి రచించిన 'బెటర్ ట్రాజెక్టరీస్' ఆంగ్ల వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా హాజరైన శంకరనారాయణ మాట్లాడుతూ రచయిత్రి అంజన తన పుస్తకంలో నేటి యువతరానికి మార్గ నిర్దేశనం చేసే పలు అంశాలు ప్రస్తావించారని కొనియాడారు. అంతకు ముందు గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు, సాహితీవేత్త విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బెటర్ ట్రాజెక్టరీస్ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న శంకరనారాయణ తదితరులు

ఫిట్స్‌తో మహిళ మృతి

చేవెళ్ల: మతిస్థిమితం లేని ఓ మహిళ ఫిట్స్‌తో మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మండలంలోని మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహారాజ్‌పేటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలంలోని మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన వెంకటయ్య, లక్ష్మిలకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురు సరిత(25)ను నాలుగేళ్ల క్రితం షాబాద్ మండలంలోని మద్దూర్ గ్రామానికి చెందిన రమేశ్‌కి ఇచ్చి వివాహం చేశారు. ఆమె మూడు సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నారు. ఇటీవలే సరితను తల్లిదండ్రులు గుర్తించి ఇంటికి తీసుకువచ్చారు. వచ్చిన వారం రోజులు కూడా కాకముందే ఫిట్స్‌తో ఆమె మృతి చెందారు. కూతురు ఇంటికి వచ్చిందనే సంతోషం కూడా తీరకముందే తల్లిదండ్రులకు తీరని వేదన మిగిలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

లీఫ్స్ సంస్థ ఉపాధ్యక్షుడు జీవన్



సదస్సులో పాల్గొన్న జీవన్, నాయకులు

యాచారం: రైతులు ఏళ్లుగా భూ సమస్యలు ఎదుర్కొంటూ సమయంతో పాటు డబ్బును సైతం వృథా చేసుకుంటున్నారని లీఫ్స్ సంస్థ(లీగల్ ఎంపవర్మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ) ఉపాధ్యక్షుడు జీవన్ పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలో శుక్రవారం భూ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించి, తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామాల్లో దాదాపు 3 వేలకు పైగానే భూ సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. అనేక సమస్యలు పట్టాదారు, పాసుపుస్తకాల్లో రైతుల పేర్ల మార్పు, మ్యూటేషన్లు, రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోవడం వంటివే అన్నారు. వాటి పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులకు సూచించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మండలంలో భూ సమస్యలు లేని విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నానక్‌నగర్ మాజీ సర్పంచ్ ముత్యాల వెంకట్‌రెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మాట్రిమోనియల్' మోసగాడి అరెస్టు

రాయదుర్గం: పెళ్లి సంబంధాలు కుదుర్చుతామని నకిలీ మాట్రిమోనియల్ సైట్ల ద్వారా మోసాలకు పాల్పడున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేకు శుక్రవారం సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. మారం అశోక్‌రెడ్డి అనే వ్యక్తి నకిలీ వెబ్‌సైట్లు, స్నాప్ చాట్ ద్వారా మహిళలను ఆకర్షిస్తూ మోసగిస్తున్నాడు. ఇటీవల ఓ మహిళకు పెళ్లి సంబంధం పేరిట మాయమాటలు చెప్పి రూ.14 లక్షలు కొట్టేశాడు. దీనిపై ఫిర్యాదు మేరకు విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.



నిందితుడు అశోక్‌రెడ్డి